రక్షకుడి జననం..లోకానికి శుభదినం

- అంతటా క్రిస్మస్ శోభ
- నేడు క్రిస్మస్ వేడుకలకు నియోజకవర్గంలో చర్చిలు ముస్తాబు
- కిటకిటలాడిన మార్కెట్లు

సత్తెనపల్లి: కళ్లు చెదిరే వెలుగులు.. విద్యుత్ దీప కాంతులు.. చర్చిలన్నీ ధగధగలాడుతున్నాయి. విశ్వాసుల ఇళ్లపై నక్షత్రాలు మెరుస్తున్నాయి.. ప్రపంచానికి వెలుగునిచ్చే ఏసయ్య జనన శుభసమయం వచ్చేసింది. క్రైస్తవ లోకం పండుగ ఆనందాన్ని ఆస్వాదించడం ప్రారంభించారు. ఏసుక్రీస్తు జన్మించిన శుభదినం క్రిస్మస్. నశించిన దానిని వెదకి రక్షించుటకు ఏసుక్రీస్తు ఈలోకానికి వచ్చెను అని బైబిల్ చెబుతుంది. ప్రేమే మార్గమని, కరుణే ఆయుధమని తెలియజేస్తూ దయ, కనికరం అన్న మార్గాలను పాటించి వాటితో ప్రపంచాన్ని జయించవచ్చునన్న సత్యాన్ని లోక జనులకు తెలుపుతూ, శత్రువునైనా క్షమించి ఆదరించాలన్న సందేశాన్నందించిన కరుణా మయుడు ఏసుక్రీస్తు. ఆ లోక రక్షకుడు, ప్రేమమయుడు భువిపై ఏతెంచిన రోజును ప్రపంచ వ్యాప్తంగా క్రిస్మస్ పర్వదినోత్సవంగా జరుపుకొంటారు. కరుణామయుడి జన్మదినోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు క్రైస్తవ ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. బుధవారం క్రిస్మస్ పండుగ నేపథ్యంలో ఇప్పటికే నియోజకవర్గమంతట క్రిస్మస్ సందడి కనిపిస్తోంది. ఈ సందర్భంగా పట్టణంలోని పురాతన, ప్రసిద్ధి చెందిన కొన్ని ప్రార్థనాలయాల చారిత్రక నేపథ్యంపై సాక్షి ప్రత్యేక కథనం.



విద్యుత్ దీపాల వెలుగుల్లో సత్తెనపల్లి లూథరన్ చర్చి

పట్టణానికే మణిహారం లూథరన్ చర్చి

పట్టణ నడిబొడ్డున గుంటూరు – మాచర్ల ప్రధాన రహదారి పక్కన 1925లో లూథరన్ చర్చి నిర్మించారు. 15 ఎకరాల విస్తీర్ణంలో బ్రిటీషు ప్రభుత్వ హయాంలో హయ్యర్ దొర ఈ చర్చి నిర్మించారు. చర్చి ఆవరణలో విశాలమైన స్థలం ఉండటంతో ప్రతి ఏటా సువార్త సభలు జరుగుతుంటాయి. ఒకేసారి 2 వేల మందికి పైగా చర్చిలో ప్రార్థనలు చేయడానికి అవకాశం ఉంది. పురాతనమైన చర్చిగా పేరుంది.

పురాతన బాగ్స్ మెమోరియల్ బాప్టిస్టు చర్చి...

పట్టణంలోని అతిపురాతన ఆలయాలల్లో ఒకటి బాగ్స్ మెమోరియల్ సెంటినరీ తెలుగు బాప్టిస్ట్ చర్చి. స్థానిక శరభయగుప్తా హిందూ ఉన్నత పాఠశాల వద్ద 1849లో రెండు ఎకరాల స్థలంలో బాప్టిస్టు చర్చిని అమెరికాకు చెందిన బాగ్స్ దొర నిర్మించారు. ఆయన నిర్మించడం వల్ల ఈ చర్చికి బాగ్స్ మెమోరియల్ సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చిగా నామకరణం చేశారు. ఇక్కడ మరో నూతన చర్చి నిర్మాణానికి గతంలో డాక్టర్ వై.ఎస్.రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపన చేశారు. ప్రస్తుతం ఈచర్చి నిర్మాణం పూర్తయ్యింది. ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలతో చర్చి సందడిగా ఉంటుంది.

దీనులకు బాసట ఆర్సీఎం చర్చి

పట్టణంలోని గుంటూరు రోడ్డులో ప్రధాన రహదారి పక్కన బ్రిటీషు పాలకులు 1965లో రోమన్ క్యాథలిక్ మిషనరీ వారిచే ఆర్సీఎం చర్చి నిర్మించారు.


విద్యుత్ దీపాల అలంకరణలో ఆర్సీఎం చర్చి

ఆధ్యాత్మికతతో పాటు విద్య, వైద్య సేవలను కూడా పట్టణ ప్రజలకు చేరువ చేశారు. క్రిసమస్ సందర్భంగా ఏటా పేదలకు దుస్తులు, దుప్పట్లు పంపిణీ చేస్తారు. క్రిస్‌మస్ రోజున సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు.

ముస్తాబైన చర్చిలు...

క్రోసూరు: క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని మండలంలోని అన్ని గ్రామాల్లోని చర్చిలు, ప్రార్థనా మందిరాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రోసూరులోని ఏఈఎల్‌సీ చర్చిని విద్యుత్‌దీపాల కాంతులతో అలంకరించారు.

నిబంధనలు పాటించాలి

క్రోసూరు: రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకోకుండా, వాహన చోదకులు, ప్రయాణికులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎస్ఐ నాగేంద్రరావు మంగళవారం వివరించారు. చలికాలం మంచు కురుస్తున్నందున వేకువజామున వీలైనంత వరకు ప్రయాణాలు చేయరాదని సూచించారు. రాత్రిళ్లు అధిక వేగంతో ప్రయాణించరాదన్నారు. ట్రాక్టర్ యజమానులు, ట్రాక్టర్ ట్రాలీ వెనుక భాగంలో తప్పకుండా లైట్లను, రేడియం స్టిక్కర్లను ఏర్పాటు చేసుకోవాలన్నారు. వాహనాలను రోడ్డు మార్జిన్‌కి దూరంగా పార్క్ చేసుకోవాలన్నారు.

నిత్యావసరాలు పంపిణీ

సత్తెనపల్లి: పేదలందరూ సంతోషంగా క్రిస్మస్ పర్వదినం జరుపుకోవాలని ఒక మంచి ఉద్దేశంతో పండగ సందర్భంగా సరుకులు పంపిణీ చేస్తున్నట్లు సీపీఎం మండల కార్యదర్శి పెండ్యాల మహేష్ అన్నారు. సత్తెనపల్లి మండలం గుడిపూడి ఎస్టీ కాలనీలోని 40 మంది పేదలకు సీపీఎం సత్తెనపల్లి మండల కమిటీ ఆధ్వర్యంలో సీపీఎం సీనియర్ నాయకులు, న్యాయవాది పిన్నమనేని పాములయ్య మంగళవారం ఏడు రకాల నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. పెండ్యాల మహేష్ మాట్లాడుతూ క్రిస్మస్ పండుగ సందర్భంగా సరుకులు పంపిణీ చేసిన పాములయ్యకు ప్రత్యేకమైన అభినందనలు తెలిపారు. సామాజిక కార్యకర్త మౌలానా అబ్దుల్ ఆఫీజ్, జూనియర్ న్యాయవాదులు రవి, సాయి, సీపీఎం నాయకులు బి.శివయ్య, వెంకటేశ్వర్లు మల్లేశ్వరి, మరియమ్మ, ఆంజనేయులు, సురేష్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించాలి

సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు

నకరికల్లు: పెండింగ్ కేసులు సత్వరమే పరిష్కరించుకోవాలని సత్తెనపల్లి డీఎస్పీ ఎం.హనుమంతరావు ఆదేశించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం వార్షిక తనిఖీలు నిర్వహించి, రికార్డులు పరిశీలించారు. స్టేషన్ కలియతిరిగారు. సిబ్బందితో మాట్లాడి పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ కేటాయించిన డ్యూటీలను సమర్థవంతంగా నిర్వహించేలా సిబ్బందికి అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాలు, దొంగతనాలను అరికట్టేందుకు ప్రణాళికతో పనిచేయాలన్నారు. గ్రామాల్లో కొట్లాటలు, తగాదాలు లేకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తూ ఉండాలన్నారు. పేకాట, కోడిపందేలు, బెట్టింగ్, బెల్టుషాపులను నిర్మూలించాలన్నారు. ఆయన వెంట రూరల్ సీఐ ఎం.వి. సుబ్బారావు, ఎస్ఐ చల్లా సురేష్ పాల్గొన్నారు.

వరికోతలు వాయిదా వేసుకోండి

మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు

నకరికల్లు: మండలంలో 843.60 క్వింటాళ్ల వరి ధాన్యాన్ని రైతుసేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసినట్లు మండల వ్యవసాయాధికారి కె.దేవదాసు తెలిపారు. మండలంలోని చల్లగుండ్ల, అడ్డరోడ్డు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. కోతదశలో ఉన్న వరి పొలాలను సందర్శించిన ఆయన మాట్లాడుతూ తుఫాను నేపథ్యంలో జల్లులు కురుస్తున్నందున వరికోతలు వాయిదా వేసుకోవాలని రైతులకు సూచించారు. వరి ఏ గ్రేడ్ రకం క్వింటా రూ2,320లు, బస్తా రూ1,740లు, సాధారణ రకం ధాన్యం క్వింటా రూ 2,300లు, బస్తా రూ1,725 ధరను నిర్ణయించినట్లు తెలిపారు. రైతుసేవా కేంద్రాల్లో పేర్లు నమోదు చేసుకొని కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. దళారులకు ధాన్యాన్ని అమ్మి నష్టపోవద్దని సూచించారు. ఉద్యానవన సహాయకుడు వి.వంశీ, వ్యవసాయ విస్తరణాధికారి కె.దిలీప్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు


క్రోసూరు లూథరన్ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు


డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశ్రమంలో సెమీ క్రిస్మస్ వేడుకలు


బెల్లంకొండలో క్రిస్మస్ తాత వేషధారణలో చిన్నారులు

క్రోసూరు: క్రోసూరు లూథరన్ చర్చి ఆధ్వర్యంలో సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం చర్చి పాస్టర్ రెవ. డా.ఎం.సుందరరావు అధ్యక్షతన జరిగింది. ఈసందర్భంగా పాస్టర్ మాట్లాడుతూ ఏసుక్రీస్తు ఈ లోక ప్రజలను పాపవిముక్తులను చేసి, రుజుమార్గం చూపేందుకు జన్మించినట్లు తెలిపారు. ప్రజలు ప్రేమ, కరుణ, జాలి, దయ కలిగి ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమం అనంతరం సండే స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన క్రీస్తు పుట్టుక అనే నాటిక విశ్వాసులను ఆకర్షించింది. స్థానిక సంఘ పెద్దలు, మహిళలు, సండే స్కూల్ టీచర్స్, విశ్వాసులు పాల్గొన్నారు.

ఆశ్రమంలో సెమీ క్రిస్మస్ వేడుకలు..

రాజుపాలెం: క్రీస్తు బోధనలను ప్రతీ ఒక్కరు ఆచరించాలని నేషనల్ యాంటీక్రైం, హ్యూమన్ రైట్స్ ఆఫ్ ఇండియా చైర్మన్, ఫౌండర్ డాక్టర్ సామేల్ జాన్‌కిమ్ తెలిపారు. మండలంలోని కొండమోడు సమీపంలోని వీరమ్మ కాలనీలో గల దీనమ్మ అండ్ రూరల్ డెవలెప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వృద్ధుల ఆశ్రమంలో సెమీ క్రిస్మస్ వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో ముఖ్య అతిథిగా హ్యూమన్ రైట్స్ చైర్మన్ పాల్గొని కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. దీనమ్మ రూరల్ డెవెలెప్‌మెంట్ సొసైటీ చైర్మన్ గరికపాటి శంకరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యులు దొంతిరెడ్డి సునీత శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచ్ బండి కోటి నాగిరెడ్డి, కాంట్రాక్టర్ పశ్యావుల కోటేశ్వరరావు, వర్ల ఆదాం, అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

బెల్లంకొండలో...

బెల్లంకొండ: మండల కేంద్రమైన బెల్లంకొండలో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బేడ బుడగ జంగాల కాలనీలో గల ఇండియా పెంతెకోస్తు చర్చిలో దైవజనులు ఆనంద్‌పాల్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పాస్టర్ దుగ్గి సామేలు, సంఘపెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

నేడు బాలయేసు తిరునాళ్ల మహోత్సవం

అచ్చంపేట: బాలయేసు జన్మదినం క్రిస్మస్ సందర్భంగా మండలంలోని తాళ్లచెరువులో నూరు సంవత్సరాల చరిత్రగల బాలయేసు దేవాలయంలో తిరునాళ్ల మహోత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించేందుకు సకల ఏర్పాట్లు చేశారు. ఇంగ్లండ్‌కు చెందిన స్వామి అర్లానంద 1892లో తాళ్లచెరువు గ్రామాన్ని నిర్మించారు. ఈ ప్రాంతంలో నివశించేవారికి క్రైస్తవ మత విశిష్టతన తెలియచేసి మత ప్రబోధం చేశారు. 1950లో గ్రామ నడిబొడ్డులో బాలయేసు మందిరాన్ని నిర్మించారు. అప్పటి నుంచి ప్రతి యేటా డిశంబర్ 25న వచ్చే క్రిస్మస్ పండుగ సందర్భంగా తిరునాళ్ల మహోత్సవాలను, బాలయేసు జన్మదినోత్సవ వేడుకలను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అయితే ఈ యేడాదితో బాలయేసు దేవాలయం నిర్మించి 75 సంవత్సరాలు పూర్తకానుండటంతో దేవాలయాన్ని ఆధునికీకరిస్తున్నారు. 2025 మే నాటికి పూర్తి చేసి వజ్రోత్సవాలను నిర్వహించేందుకు సుమారు రూ.2కోట్ల వ్యయంతో ఆధునికీకరణ పనులు చేస్తున్నారు. బుధవారం ఉదయం 9గంటలకు గుంటూరు పీఠాధిపతులు చిన్నాబత్తిని భాగ్యయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలతో, క్రీస్తు సందేశంతో వేడుకలు ప్రారంభమవుతాయి. రాత్రి 10 గంటల నుంచి బాణసంచాతో తాళ్లచెరువు గ్రామ వీధులలో బాలయేసు తేరు ఊరేగింపు కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఈ సందర్భంగా ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేస్తామని, విశ్వాసులు బాలయేసును దర్శించుకుని తరించవలసినదిగా విచారణ గురువులు పుట్టి అంథోనిరాజు కోరారు.


తిరునాళ్లకు సిద్ధమైన బాలయేసు దేవాలయం

మారి సంస్థ ఆధ్వర్యంలో పత్తి రైతుల సమావేశం

అమరావతి: భారత గ్రామ నవ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో మండల పరిధిలోని ధరణికోట గ్రామంలో మంగళ వారం పత్తిరైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో లాం శాస్త్రవేత్త శ్రీ చాముండేశ్వరి రైతులు పత్తి పింజ నాణ్యతపై పలు సూచనలు చేశారు. వ్యవసాయశాఖ జాయింట్ డైరెక్టర్ మురళీ కృష్ణ, లాం ఫారం శాస్త్రవేత్త దుర్గాప్రసాద్, అసిస్టెంట్ డైరెక్టర్ హనుమంతరావు, మారి సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మురళీ, మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్‌లు పత్తిపంటలో తసుకోవాల్సి జాగ్రత్తల గురించి వివరించారు. మునుగోడు, అత్తలూరు, జూపూడి, మల్లాది, దిడుగు, ధరణికోట గ్రామాల నుంచి పత్తి రైతులు పాల్గొన్నారు.

గేదెపై వీధికుక్కల దాడి



నాదెండ్ల: గణపవరం గ్రామంలో వీధి కుక్కల బెడద రోజురోజుకు తీవ్ర మౌతుండటంతో గ్రామస్తులు బెంబేలెత్తుతున్నారు. ఈ నెల 21న గ్రామంలోని పశువుల ఆసుపత్రి వీధిలో పెడవలి రామారావుకు చెందిన నాలుగు నెలల లేగదూడను వీధికుక్కలు దాడి చేసి పీక్కుతిన్న సంఘటన మరువకముందే అదే పశువుల కొష్టంలో తల్లిగేదెపై సోమవారం అర్ధరాత్రి దాడిచేశాయి. గేదె ముందుభాగంపై దాడి చేయటంతో కొమ్ములతో విసరటంతో వెనుకభాగంపై దాడి చేసి కాళ్ళు, తోకను గాయపరిచాయి. ఉదయాన్నే కొష్టానికి వచ్చిన రామారావు గమనించి గేదెను పశువుల ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చేయించాడు. ఈ ఘటనపై ఆ వీధిలోని పశువుల యజమానులు మంగళవారం పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. వీధి కుక్కల దాడులు పెరుగున్నాయని, నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నా పట్టించుకోవటం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈకేవైసీ తప్పనిసరి



బొల్లాపల్లి : స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో పి. సీతారామయ్య సచివాలయ సిబ్బందితో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. హౌస్ హోల్డ్ మ్యాపింగ్, పీఏసీఎస్ ఖాతాదారులు వివరాల నమోదు సంబంధించి సమీక్ష నిర్వహించినట్లు తెలిపారు. పాఠశాలలో విద్యార్థులకు సంబంధించి డేటాకు సంబంధించి ఈకేవైసీ చేయాలన్నారు. అలాగే సహకార సంఘంలో ఖాతాదారుల వివరాలు సేకరణ, ఆన్‌లైన్ నమోదు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో–2 కె.పార్వతి, ఏపీవో లక్ష్మణరావు, పంచాయతీ, రెవెన్యూ కార్యదర్శులు పాల్గొన్నారు.

మానవాళి పాప విమోచనార్థం క్రీస్తు జననం

పెన్షనర్స్ హోంలో ఘనంగా సెమీక్రిస్మస్ వేడుకలు

సత్తెనపల్లి: మానవాళి పాప విమోచనార్థం ఏసు క్రీస్తు జన్మించారని, ఆయన బోధనలు అందరికీ అనుసరణీయమని ఏపీ ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ సత్తెనపల్లి యూనిట్ అధ్యక్షుడు జక్కుల లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని పెన్షనర్స్ అసోసియేషన్ హోంలో మంగళవారం నూతన కార్యవర్గం, ఇతర సభ్యులతో కలిసి ఘనంగా నిర్వహించిన క్రిస్మస్ వేడుకలకు ఆయన అధ్యక్షత వహించారు.

ఆయన మాట్లాడుతూ కులమతాలకతీతంగా అన్ని రకాల పండగలను వైభవంగా జరుపుకోవడం మన దేశ సంస్కృతి అన్నారు. అన్ని మతాలపై సమ భావన కలిగి ఉండడం, పరమత సహనాన్ని కలిగి ఉండడం తదితర లక్షణాలను ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాలన్నారు. సంఘ సభ్యుడు కె.పోతులూరయ్య ప్రార్థనతో వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ఏసు ప్రభువు ప్రపంచానికి ప్రేమను, కరుణను పంచారన్నారు. ముందుగా క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కైపు భాస్కర్‌రెడ్డి తన భార్య కైపు శకుంతల జ్ఞాపకార్థం రూ. 25 వేలు విరాళంగా అందించారు.

భాస్కర్ రెడ్డిని పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. అసోసియేషన్ సత్తెనపల్లి యూనిట్ సెక్రటరీ కేబీఆర్‌జే ప్రసాద్, కోశాధికారి కె.రంగారెడ్డి, సభ్యులు కె.పోతులూరయ్య, ఫ్రాన్సిస్, కె.అంతయ్య, వెంకట్రావు, క్రీస్తుదాసు, శృంగారం, చంద్రయ్య, జి.వెంకటేశ్వర్లు, మోహిద్దిన్, హనుమంతరావు, మల్లేశ్వరరావు, నాసరయ్య, సంగీతరావు, రమాదేవి, హెలీనా పాల్గొన్నారు.


సెమీక్రిస్మస్ వేడుకల్లో పాల్గొని కేక్ కట్ చేస్తున్న పెన్షనర్లు

సమానత్వం కోసం పోరాడిన యోధుడు పెరియార్

సత్తెనపల్లి: దేశ స్వాతంత్ర్యం కన్నా సాంఘిక సమానత్వం మిన్న అన్న నినాదంతో పోరాటం చేసిన పోరాట యోధుడు పెరియార్ రామస్వామి అని బీసీ సంఘ నాయకులు కొనియాడారు. పట్టణంలోని బీసీ సంఘ కార్యాలయంలో బీసీ సంఘ నాయకుడు షేక్ చిన్న షరీఫ్ ఆధ్వర్యంలో సంఘ సంస్కర్త పెరియార్ రామస్వామి 51వ వర్ధంతి మంగళవారం నిర్వహించారు. పెరియార్ రామస్వామి చిత్రపటానికి పూలమాలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ సంఘ నాయకులు మాట్లాడుతూ సమాజంలోని అన్నికులాల వారికి సమానంగా దేవాలయాల్లో ప్రవేశాలు కల్పించాలని వాదించారన్నారు. మనదేశంలో మొట్టమొదటిసారిగా పట్టణ ప్రాంతాల్లో కుళాయి ద్వారా మంచినీటి సరఫరా చేయించిన ఘనత పెరియార్ రామస్వామికి దక్కుతుందన్నారు. నాయకులు గార్లపాటి ప్రభాకర్ రావు, చింకా అంకమ్మరావు, గుంటూరు గోవిందు, కుమ్మరి దస్తగిరి, కొమర నరసింహారావు, గుంజి విజయకుమార్, పిక్కల రత్తయ్య తదితరులు పాల్గొన్నారు.


పెరియార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గార్లపాటి ప్రభాకర్, బీసీ సంఘ నాయకులు

రైతుల సమస్యలను పరిష్కరిస్తాం

రాజుపాలెం: రైతులు సాగు చేసుకునే భూమిని ఆన్‌లైన్‌లో నమోదు చేసుకునేందుకు దరఖాస్తు చేసుకుంటే మీవద్ద ఉన్న ఆధారాలను పరిశీలించి వెంటనే పరిష్కరిస్తారని సత్తెనపల్లి ఆర్డీఓ రమణ కాంత్‌రెడ్డి తెలిపారు. మండలంలోని బలిజేపల్లిలో రెవెన్యూ సదస్సు మంగళవారం జరిగింది. ఈ సదస్సులో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆర్డీఓ మాట్లాడుతూ రైతుల భూ సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని, 1బీ అడంగులలో తప్పులు ఉంటే దరఖాస్తు చేసుకుంటే పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. తహసీల్దారు దుర్గేష్‌రావు, డిప్యూటీ తహసీల్దారు ఎస్‌కే జానీబాషా, వీఆర్వో నారాయణ, మండల సర్వేర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మాదలలో...

మాదల(ముప్పాళ్ళ): మండలంలోని మాదల గ్రామంలో రెవెన్యూ సదస్సు మంగళవారం జరిగింది. సదస్సులో తహసీల్దార్ ఎం.భవానిశంకర్ పాల్గొని మాట్లాడారు. భూ యజమానులు తమ భూములకు సంబందించిన సమస్యలను సదస్సుల ద్వారా పరిష్కరించుకోవచ్చన్నారు. సమస్యపై అర్జీ అందించిన ప్రతి ఒక్కరికీ రశీదు ఇవ్వటం జరుగుతుందని, పది రోజుల్లో పరిష్కారం చేయటం జరుగుతుందన్నారు. మొత్తం 16 అర్జీలు అందినట్లు తెలిపారు. గ్రామసర్పంచ్ కోటేశ్వరమ్మ, ఉప సర్పంచ్ తిరుమలశెట్టి సైదుబాబు, మాజీ ఎంపీపీ గోగినేని కోటేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్‌లక్ష్మీప్రసాదు, మండల సర్వేయర్ టి.సుధాకర్, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


బలిజేపల్లి రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న ఆర్డీఓ రమణకాంత్‌రెడ్డి

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

క్రోసూరు: క్రోసూరు మండలం ఉయ్యందన గ్రామానికి చెందిన రెట్టాడి వెంకట్రావు(37) ద్విచక్రవాహనంపై వెళ్తుండగా కారు ఢీకొని అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన సోమవారం రాత్రి జరిగినట్లు ఎస్ఐ నాగేంద్రరావు మంగళవారం తెలిపారు. ఎస్ఐ కథనం ప్రకారం.. సొంత పనుల నిమిత్తం క్రోసూరు వచ్చిన వెంకట్రావు ద్విచక్రవాహనంపై తిరిగి సొంత గ్రామమైన ఉయ్యందనకు రాత్రి 11 గంటల వెళ్తున్నాడు. క్రోసూరు శివారు ఎర్రబాలెం వద్ద సత్తెనపల్లి వైపు నుంచి అచ్చంపేట వెళ్తున్న కారు ఢీకొట్టటంతో తీవ్రగాయాలతో అక్కడికక్కడ మృతి చెందాడు. స్థానికులు పోలీస్టేషన్‌కు సమాచారం ఇవ్వగా సంఘటనా స్థలానికి చేరుకుని ప్రమాదానికి కారణమైన కారు స్టేషన్ తరలించి ముద్దాయిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మృతుడి భార్య వెంకటరమణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించినట్లు ఎస్ఐ తెలిపారు. మృతునికి భార్య, ఒక కుమారుడు, కుమార్తె కలరు.


మృతుడు రెట్టాడి వెంకట్రావు

క్లుప్తంగా

కలవరపెడుతున్న అల్పపీడనం



ముప్పాళ్ళ: అల్పపీడనం రైతులను కలవరపెడుతుంది. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో వాతావరణశాఖ అల్పపీడన ప్రభావంతో వర్షాలు పడతాయని చేసిన హెచ్చరికలు రైతులను ఆందోళనకు గురి చేస్తున్నాయి. మంగళవారం ఉదయం నుంచి చిరుజల్లులు కురుస్తుండటంతో పంటలను కాపాడుకునేందుకు రైతులు పాట్లు పడుతున్నారు. మండలంలో వరిపంట కోత దశలో ఉంది. కొన్ని చోట్ల కోత కోసి పనలపై ఉంది. అల్పపీడనం ప్రభావంతో కూలీలకు డిమాండ్ పెరిగింది. ఎక్కువ కూలీ ఇచ్చి కోసిన పంటను కుప్పలుగా వేసుకుంటున్నారు. మరికొన్ని చోట్ల యంత్రాలతో కోసిన ధాన్యం రాశులను కాపాడుకునేందుకు నానా పాట్లు పడుతున్నారు. వర్షానికి తడవకుండా ధాన్యపు రాశులపై పట్టలు కప్పుకున్నారు.

నరుకుళ్లపాడులో 'పొలం పిలుస్తోంది'



అమరావతి: మండల పరిధిలోని నరుకుళ్లపాడు గ్రామంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. జిల్లా వ్యవసాయ అధికారి మురళీకృష్ణ పాల్గొని కంది, మినుము పంటల క్షేత్ర సందర్శన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అపరాల సాగులో కందిలో అంతర పంటగా మినుము సాగు చేస్తే రైతులకు లాభదాయకంగా ఉంటుందన్నారు. లాం ఫామ్ శాస్త్రవేత్త ఎస్‌వీవీ దుర్గాప్రసాద్ పత్తి తీతల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మండల వ్యవసాయశాఖాధికారి అహ్మద్‌తో పాటుగా వ్యవసాయశాఖ సిబ్బంది రైతులు, పాల్గొన్నారు.

హైందవ శంఖారావం విజయవంతం చేయండి



అమరావతి: విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో సనాతన హిందూ ధర్మరక్షణకోసం జనవరి 5వతేదీన విజయవాడలో నిర్వహించే హైందవ శంఖారావాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ మేకల హనుమంతరావు కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సమాజంలో సనాతన హైందవ ధర్మ రక్షణకోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. హిందూధర్మం నిత్యం నిర్లక్ష్యానికి గురవుతున్న తరుణంలో చైతన్యం కోసమే ఈ హైందవశంఖారావం సభ నిర్వహిస్తున్నామన్నారు. సమరత సేవాసమితి సభ్యులు గోగినేని వెంకటరమణ, కోయ సురేషకుమార్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ కార్మికురాలి మృతి



నాదెండ్ల: గణపవరంలోని ఓ పొగాకు పరిశ్రమలో పనిచేస్తున్న మహిళ రెండు రోజులక్రితం అస్వస్థతకు గురై గుంటూరులో ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. అంబేద్కర్ కాలనీలోని సొంగా వెంకట రమణ (56) గడిచిన ముప్పై ఏళ్ళుగా పొగాకు పరిశ్రమలో గ్రేడింగ్ పనులకు వెళ్తుంటుంది. శుక్రవారం గ్రేడింగ్ పనిచేస్తుండగా అస్వస్థతకు గురై పడిపోయింది. ఆమెను వెంటనే చిలకలూరిపేటలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందింది. ఆమెకు భర్త తిరుపాలు, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఆమె మృతి పట్ల మున్సిపల్ వైస్ చైర్మన్ వలేటి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు కొండెపాటి నాగయ్య, పార్టీ గ్రామ అధ్యక్షుడు కాట్రు రమేష్, పలువురు నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

క్యారమ్స్ పోటీలలో ఏఎంజీ విద్యార్థుల ప్రతిభ

చిలకలూరిపేట: రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ క్యారమ్స్ పోటీలు ప్రకాశం జిల్లాలోని పాకాల జెడ్పీ హైస్కూల్‌లో ఈ నెల 22,23 తేదీలలో నిర్వహించారు. ఈ పోటీలలో ఏఎంజీ హైస్కూల్ విద్యార్థులు అండర్–17 విభాగంలో సీహెచ్ స్టీఫెన్‌పాల్ రజిత పతకం, అండర్–19 విభాగంలో బందు హేనోస్ కాంస్య పతకం సాధించారు. విద్యార్థులను ఏఎంజీ ఇండియా ఇంటర్నేషనల్ సంస్థ డైరెక్టర్ డాక్టర్ అరుణ్‌కుమార్ మహంతి అభినందించారు.